బీజేపీ రాజేంద్రనగర్ అభ్యర్థిగా శ్రీనివాస్‌రెడ్డి

ప్రొఫైల్



పేరు: తోకల శ్రీనివాస్‌రెడ్డి
జననం: 21జనవరి1991
కుటుంబ నేపథ్యం: భార్య: తోకల సింధురెడ్డి, **కుమారుడు:** త్రిశాంత్ రెడ్డి, తల్లిదండ్రులు: తోకల శ్రీనివాస్ రెడ్డి, సంధ్యారెడ్డి
విద్యాభ్యాసం: వాగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటిక్స్ (న్యూయార్క్)
రాజకీయ నేపథ్యం: విద్య పూర్తయిన తర్వాత ప్రజలకు సేవచేయాలనే ఉద్దేశంతో 2015లో టీఆర్ఎస్ పార్టీలో చేరాడు. తెలంగాణ జాగృతి కన్వీనర్‌గా ఉన్నాడు. 2016లో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ నుంచి టీఆర్ఎస్ పార్టీ నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేసి విజయం సాధించాడు. 2018లో సాధారణ అసెంబ్లి ఎన్నికల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి 13,084 ఓట్లు సాధించారు. 2020 నవంబర్ 9న భారతీయ జనతాపార్టీలో చేరారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో ప్రత్యర్థి అభ్యర్థి ప్రేమ్‌దాస్‌గౌడ్‌పై విజయం సాధించి కార్పొరేటర్‌గా ఉంటున్నాడు. తన తండ్రి ఆశయ సాధన కోసం రాజకీయాలలోకి వచ్చి మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్‌గా ఏడేళ్లుగా ప్రజలకు సేవ చేస్తున్నాడు. డివిజన్ అభివృద్ధిలో భాగంగా ప్రజలకు అన్ని సమయాలలో అందుబాటులో ఉంటున్నారు. పేదలకు సహాయం చేయాలనే ఉద్దేశ్యంతో తోకల ఆరోగ్య రథం ద్వారా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో ఎమ్మెల్యే గెలిచి నియోజకవర్గం అభివృద్ధి చేయాలనే సంకల్పంతో బీజేపీ నుంచి బరిలోకి దిగుతున్నానని పేర్కొన్నారు.

భారీ మెజార్టీ లక్ష్యంగా పనిచేయాలి

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: భారీ మెజార్టీ సాధించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ సూచించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు డి. వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం పట్టణ బీఆర్ఎస్ నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేపట్టాలని సూచించారు. గత సార్వత్రిక ఎన్నికలకు మించిన మెజార్టీని సాధించాలంటే నేతలంతా కష్టపడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్.గణేష్ గుప్తా, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ కౌన్సిలర్లు జహంగీర్‌ఖాన్, అజయ్, వై. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే వారికి ఓటు వేయాలి..

మైలార్‌దేవ్‌పల్లి: అభివృద్ధి చేసే వారికి ఓటు వేయాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి టీ. ప్రకాష్‌గౌడ్ ప్రజలను కోరారు. గురువారం మైలర్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని గణేష్‌నగర్ బంగారు మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారం మొదలుపెట్టారు. పార్టీ కార్యకర్తలు కాటేదాన్‌లోని ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేయాలని కరపత్రాలను ఇచ్చి అభ్యర్థించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. గత రెండు పర్యాయాలు రాజేంద్రనగర్ నియోజకవర్గానికి ప్రభుత్వం నుంచి అనేక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేశానని ప్రజలకు వివరించారు. అభివృద్ధి చేసేవారికి ఓటు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు టి ప్రేమ్‌గౌడ్, సరికొండ వెంకటేష్, గుమ్మడి కుమార్, రాఘవేందర్, బాస శ్రీనివాస్, కాశిగారి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ 2023

అభివృద్ధిని చూసి ఓటు వేయండి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్

బండ్లగూడ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ చేసిన అభివృద్ధి, సంక్షేమాలను చూసి ఓటును బీఆర్ఎస్ పార్టీకి వేయాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ కోరారు. గురువారం కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్‌లోని పలు కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ చేసిన అభివృద్ధి ఎనలేనిదన్నారు. అన్ని వర్గాల ప్రజలను అక్కున చేర్చుకోని ఆయన వారి అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. ప్రతి బస్తీ, కాలనీల్లో సమస్యలు లేకుండా అధికారులతో ఎప్పటికప్పుడు చర్చించి ప్రత్యేక నిధులు కేటాయించి సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపించారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు గోకరి సురేష్‌గౌడ్, కార్పొరేటర్లు రవిందర్‌రెడ్డి, పద్మావతిపాపయ్యయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ బొర్ర రాందాస్‌ముదిరాజ్, సాగర్‌గౌడ్, శ్రీలతసురేష్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, పద్మావతిపాపయ్యయాదవ్, అస్లాంబిన్ అబ్దుల్లా, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ప్రకాశ్‌గౌడ్ గెలుపును ఆపలేరు



నార్సింగిలో ప్రచారం చేస్తున్న చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్‌లు

మణికొండ: హైదరాబాద్ నగర శివారులో అభివృద్ధికి కేరాఫ్ రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని మార్చిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ గెలుపును ఎవరూ ఆపలేరని గండిపేట మండల బీఆర్ఎస్ పార్టీ సమన్వయకర్త తలారి మల్లేష్, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి, వైస్ చైర్మెన్ జి.వెంకటేష్ యాదవ్, మణికొండ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, పార్టీ అధ్యక్షుడు ఆర్.నర్సింహ, బి.శ్రీరాములులు పేర్కొన్నారు. గురువారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో వారు కౌన్సిలర్‌లు, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలోనే ఎక్కడా లేని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో ప్రజలకు అందాయని వాటిని పొందిన లబ్ధిదారులంతా బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్‌లు పత్తి ప్రవీణ్‌కుమార్, పత్తి శ్రీకాంత్, అరుణజ్యోతి, మహిళా అధ్యక్షురాలు ప్రియదర్శిని, మణికొండ మున్సిపాలిటీ కౌన్సిలర్‌లు బి.కావ్యశ్రీరాములు, పి.శైలజవినోద్, ఎ.నవీన్‌కుమార్, వసంతరావు, యాలాల లావణ్యనరేష్, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు లతాగౌడ్ పాల్గొన్నారు.

అక్రమ మద్యాన్ని గుర్తిస్తే సమాచారం ఇవ్వండి



గండ్ర దేవేందర్

అత్తాపూర్: సుంకం చెల్లించని మద్యం, అక్రమ నిలువ ఉంచిన మద్యం, గంజాయి లాంటి మత్తు పదార్థాల సమాచారం తెలిస్తే వెంటనే కమిషనర్ కార్యాలయంలో టోల్‌ఫ్రీ నంబర్‌లో ఫిర్యాదు చేయాలని శంషాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గండ్ర దేవేందర్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలను పురస్కరించుకొని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాల మేరకు మత్తు పదార్థాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం వినియోగదారులు, ప్రజలు మద్యాన్ని తెలంగాణ రాష్ట్రానికి చెందిన మద్యంగా గుర్తించడానికి వెరిట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఎద్దైనా అక్రమ సుంకం చెల్లించని మద్యాన్ని గుర్తిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 18004252523 సమాచారం అందిస్తే వెంటనే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల నేపథ్యంలో విధి విధానాలను తూచా తప్పకుండా పాటించాలని ఆయన కోరారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పోలీసులు, ప్రభుత్వానికి సహకరించాలన్నారు. అదే విధంగా శంషాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గండ్ర దేవేందర్‌రావు (8712658750)లో సమాచారాన్ని అందించాలన్నారు.

రెజ్లర్లకు అభినందన



రెజ్లర్లను అభినందించిన కోచ్, స్థానిక నాయకులు

మణికొండ: ధూల్‌పేట కేంద్రంగా రవీందర్ పహిల్వాన్ కేసరి రెజ్లింగ్ పోటీల్లో సత్తాచాటి రన్నరప్ చాంపియన్లుగా నిలిచిన నార్సింగి రెజ్లర్లను స్థానికులు గురువారం అభినందించారు. మూడు రోజులుగా జరిగిన పోటీల్లో రెజ్లర్‌లు మంచి ప్రతిభ చూపి ఓవరాల్ రన్నరప్‌లుగా నిలిచారని కోచ్ రాజ్‌కుమార్ తెలిపారు. రాబోయే రోజుల్లో జరిగే మరిన్ని కేసరీలలో ప్రతిభ చూపి మరిన్ని టైటిల్‌లను గెలుపొందేలా వారిని తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, ఫయీం, జ్ఞానేశ్వర్, నరేష్, ప్రశాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో బీజేపీ విజయం ఖాయం



మాట్లాడుతున్న ఉమామహేశ్వరి రెడ్డి

అత్తాపూర్: చదువు, సంస్కారం, వినయ, విధేయతలు సాధించాలన్న దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్న యువ నాయకుడు తోకల శ్రీనివాస్‌రెడ్డిని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా గెలిపించాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు కొమ్మిరెడ్డి ఉమామహేశ్వరిరెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా టికెట్ సాధించిన సందర్భంగా అత్తాపూర్‌లోని నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్‌గా ప్రజలకు సేవలు చేస్తూనే రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధికి తనవంతు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. రాజేంద్రనగర్ పట్టణ పరిధిలో పడకల ఆస్పత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, యువకులకు ఎంప్లాయిమెంట్ తదితర అభివృద్ధి పనులను చేస్తామన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఈసారి బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో వనిత, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులు జాగ్రత్తలు పాటించాలి



పనులను పరిశీలిస్తున్న బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పారిశుద్ధ్య కార్మికులు తమ విధులు నిర్వహించే సమయంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర వెల్లడించారు. పారిశుద్ధ్య నిర్వహణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ వెస్టెండ్ కాలనీ, 5వ డివిజన్‌లని ఎస్ఎంపీ రోడ్లు, సాయిరాంనగర్ కాలనీలలో స్వీపింగ్ పనులను ఆయన పరిశీలించారు. కార్మికులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ చెత్తను ఆటో రిక్షా కార్మికులకు అందించేలా చూడాలన్నారు. ఓపెన్ పాయింట్లు లేకుండా చేయాలన్నారు. వంద శాతం ఓపెన్ పాయింట్లను ఎలిమినేట్ చేసి అక్కడ చెత్త పడకుండా చూడాలన్నారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రజలు సైతం తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త సేకరణకు వచ్చే ఆటో రిక్షా కార్మికులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు రామాంజులు, మల్లేష్, కృష్ణ, రాము, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

మణికొండ: విద్యుత్ వినియోగదారులు సరఫరా, బిల్లులు తదితర సమస్యలు ఉంటే వాటిని శుక్రవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించే సమస్యల పరిష్కార వేదికలో వివరించాలని ఏఈ జ్ఞానేశ్వర్ కోరారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, సమస్యలు ఉన్న వారు వాటిని పరిష్కరించుకోవాలన్నారు.

విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలు



కార్యక్రమంలో వీసీ ఐనుల్ హసన్

రాయదుర్గం: మనూలో విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలు-2023 నిర్వహించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని లైబ్రరీ ఆడిటోరియంలో ప్రొఫెసర్లు, అధ్యాపకులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పర్యవేక్షణలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులకు క్విజ్ పోటీ నిర్వహించారు. విజిలెన్స్ కమిటీ సభ్యుడు డాక్టర్ రఫీ మహ్మద్, డాక్టర్ జమీల్ అహ్మద్, డాక్టర్ ముజాఫర్ హుస్సేన్‌ఖాన్, డాక్టర్ జరార్ అహ్మద్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన రాధేశ్యామ్



ఎమ్మెల్యే సీతక్క సమక్షంలో పార్టీలో చేరుతున్న రాధేశ్యామ్ తదితరులు

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా తెలంగాణ జాగృతి కో కన్వీనర్, పార్టీ సీనియర్ నాయకుడు రాజేంద్రనగర్ ప్రాంతానికి చెందిన అక్కరాజు రాధేశ్యామ్ తన అనుచరులతో కలిసి గురువారం ఎమ్మెల్యే సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాధేశ్యామ్ రాజేంద్రనగర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రజలకు సంక్షేమ పథకాలు చేరాలన్న అభివృద్ధి చెందాలన్నా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తామంతా ముందుండి పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని గ్రహించి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు. తనతో పాటు దాదాపు 150 మంది యువకులు పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈసారి రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

శుభాకాంక్షలు



శంషాబాద్: రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా ఖరారైన తోకల శ్రీనివాస్‌రెడ్డికి పలువురు బీజేపీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ వైఫల్యాలపై విస్తృత ప్రచారం చేయాలని ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి పార్టీ నేతలకు సూచించారు. భానుప్రసాద్, ప్రవీణ్, సంతోష్, మారుతి శివయాదవ్, సాయికుమార్, నరేష్‌ముదిరాజ్ తదితరులున్నారు.

సంతోష్‌నగర్ పీఎస్ పరిధిలో కార్డన్ సెర్చ్

సంతోష్‌నగర్: ఎన్నికల నేపథ్యంలో సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. స్టేషన్ పరిధిలోని మోయిన్‌బాగ్‌లో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్డన్ సెర్చ్‌లో సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ బిరుదరాజు రోహిత్ రాజు, సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పి.శివచంద్ర, ఎస్సైలతో పాటు పోలీసులు పెద్ద సంఖ్యలో పాల్గొని బస్తీలో మోహరించి తనిఖీలు నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ.. ఎన్నికలను పురస్కరించుకొని శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కార్డన్ సెర్చ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సెర్చ్‌లో 81 ద్విచక్ర వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేయడం జరిగిందన్నారు. 45 మందిపై ఈ-పెట్టీ కేసులను సైతం బుక్ చేయడం జరిగిందన్నారు.

అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరికలు



శ్రీనాథ్‌రెడ్డికి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: తెలంగాణతో పాటు రాజేంద్రనగర్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి చూసి బీఆర్ఎస్ పార్టీలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు చేరుతున్నారని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డి తన అనుచరులు 500 మందితో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జెడ్పీచైర్ పర్సన్ పట్నం సునీతమహేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధితో దూసుకుపోతుందన్నారు. దీనిని చూసే యువత, వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, సంతోషిరాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, అస్లాంబిన్ అబ్దుల్లా, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

రౌడీషీటర్‌కు 21 రోజులు జైలు

నాంపల్లి: న్యూసెన్స్ కేసులో న్యాయస్థానం ఓ రౌడీషీటర్‌కు 21 రోజుల జైలు శిక్షతో పాటుగా రూ.550 జరిమానా విధించింది. గురువారం రెండవ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ డీవీ సుబ్రహ్మణ్యేశ్వర రావు తీర్పును వెల్లడించారు. హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాన్‌పుర ప్రాంతానికి చెందిన షేక్ మహబూబ్ కుమారుడు షేక్ అలీ అలియాస్ అలీమ్ (32) రౌడీషీటర్. న్యూసెన్స్ కేసులో అరెస్టు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. కాగా న్యాయస్థానం నిందితుడికి 21 రోజుల జైలు శిక్షతో పాటుగా రూ.550 జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించింది.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు



పార్టీలో చేరిన నాయకులతో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ ముదిరాజ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ మాజీ బీఆర్ఎస్ వార్డు సభ్యుడు, సీనియర్ నాయకుడు కోరని శ్యామ్ పార్టీకి రాజీనామా చేసి తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్ ముదిరాజ్ సమక్షంలో ఆయన తన అనుచరులతో కలిసి పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా కస్తూరి నరేందర్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 14 ఏళ్లుగా ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఏమి లేదని ఆరోపించారు. పంచాయతీ మున్సిపల్ కార్పొరేషన్ ఫండ్‌ల నుంచి స్థానిక ప్రజా ప్రతినిధులు మంజూరు చేసిన నిధులకు సంబంధించిన పనులను శంకుస్థాపన చేయడం తప్పా.. ఆయన చేసిందేమి లేదని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో ఇప్పటికీ ప్రధాన బస్తీలు, ప్రధాన రహదారులు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో వేసినవి అని గుర్తు చేశారు. కోరని శ్యామ్ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన హామీలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ సందర్భంగా అత్తాపూర్, ఎర్రబోడ, ఉప్పర్‌పల్లి, బుద్వేల్, బన్సీలాల్‌నగర్, భగవతిగూడ ప్రాంతాలకు చెందిన మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పార్టీలో చేరారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం తథ్యం



నరేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: రాబోయే ఎన్నికల్లో రాజేంద్రనగర్‌తో పాటు రాష్ట్రంలో అత్యధిక సీట్లు కాంగ్రెస్ పార్టీ గెలుపొంది అధికారంలోకి రావటం తథ్యమని ఆ పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్‌ముదిరాజ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రభావతితో పాటు ఆ పార్టీకి చెందిన వంద మందికి పైగా కార్యకర్తలు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాటలు ఎక్కువ చేతలు తక్కువ అన్నట్టుగా ఉందని, అదే కాంగ్రెస్‌లో అన్ని వర్గాల ప్రజలతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో కాంతారావు, శివరామకృష్ణ, సీతారాందాస్, దిలీప్, కృష్ణమోహన్, నిఖిల్‌రాజ్, నాగేందర్, బీవీ రావు, భరత్, అభి, సరిత, దేవి, మంజుల, మహాలక్ష్మి, డాక్టర్ అశ్విన్, డాక్టర్ హేమంత్ రావు, డాక్టర్ చలపతి, డాక్టర్ లక్ష్మణ్‌రాజ్ ఉన్నారు.

రూ.36.40 లక్షల గంజాయి, మద్యం సీజ్

- శేరిలింగంపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్

హఫీజ్‌పేట్ : తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ వెలువడినప్పటి నుంచి శేరిలింగంపల్లి మండల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకు రూ.36.40 లక్షల గంజాయి, విదేశీ మద్యం , చరాస్‌లను సీజ్ చేసినట్లు శేరిలింగంపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి మండలంలో 109 కిలోల గంజాయి, 58 గ్రాముల చరాస్, 20 లీటర్ల నాన్ డ్యూటి స్టాంప్ పెయిడ్ మద్యం, 190 లీటర్ల అక్రమ దేశీయ మద్యం, 75 లీటర్ల బీర్లు, 1130 లీటర్ల కల్లును సీజ్ చేశామన్నారు. వీటి విలువ రూ.36.40 లక్షలు ఉంటుందన్నారు. ప్రజలు తెలంగాణ ప్రభుత్వ మద్యం ఒరిజినల్ అని తెలుసుకోవడానికి 'వెరిట్' యాప్‌ను ఉపయోగించగలరని తెలిపారు. విదేశీ, అక్రమ మద్యం, గంజాయి నిల్వలు ఇతర అసాంఘిక చర్యల సమాచారం కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 18004252523కు సమాచారం అందించాలన్నారు.

ఢిల్లీకి బయలుదేరిన టీఎన్జీఓ కేంద్ర సంఘం నేతలు



నాంపల్లి: అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్) పిలుపు మేరకు నవంబరు 3న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరుపతలపెట్టిన చలో ర్యాలీలో పాల్గొనడానికి గురువారం టీఎన్జీఓ రాష్ట్ర సంఘం పక్షాన హైదరాబాద్ నగరం నుంచి 50 మంది టీఎన్జీఓ ప్రతినిధులు ఢిల్లీకి బయలుదేరారు. టీఎన్జీఓ ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ నేతృత్వంలో బయలుదేరిన ప్రతినిధి బృందం నూతన పెన్షన్ విధానం రద్దు, ఆదాయ పన్ను పరిమితి పెంపు, కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ విధానం రద్దు తదితర డిమాండ్ల సాధన కోసం దేశవ్యాప్తంగా జరుగుతున్న ర్యాలీలో పాల్గొంటుంది. ఢిల్లీకి బయలుదేరిన టీఎన్జీఓ కేంద్ర సంఘం నేతల్లో అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, కోశాధికారి రామినేని శ్రీనివాసరావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి నామినేషన్లు షురూ..



మల్లయ్య

రాజేంద్రనగర్: నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎన్నికల అధికారి, ఆర్డీఓ మల్లయ్య వెల్లడించారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ప్రారంభమవుతుందన్నారు. నామినేషన్ల పత్రాలను అందించేందుకు ఆర్డీఓ కార్యాలయంలో కొత్తగా హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి నామినేషన్లను స్వీకరించాలన్నారు. గురువారం 12 మంది తమ పేర్లను నమోదు చేసుకొని దరఖాస్తు స్వీకరించారని వెల్లడించారు. నామినేషన్ పత్రాలు స్వీకరించిన వారిలో 11 మంది స్వతంత్రులు కాగా.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తరఫున ఒక నామినేషన్ పత్రాన్ని తీసుకున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అత్తాపూర్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. నామినేషన్ దాఖలు చేసేందుకు నామినేషన్ వేస్తున్న అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే లోనికి అనుమతిస్తామన్నారు. ఆర్డీఓ కార్యాలయం ఆవరణలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. బీసీ, ఓసీలకు నామినేషన్ల పత్రాలతో పాటు రూ.10 వేలు జమ చేయాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.5 వేలు రుసుం ఉంటుందన్నారు. నామినేషన్లు వేసేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పూర్తిస్థాయి సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. అధికారులు, సిబ్బంది నామినేషన్ పత్రాలను పూర్తిగా పరిశీలించి స్వీకరిస్తారన్నారు.

ఉత్సాహంగా సైకిల్ రైడ్

బండ్లగూడ: విద్యార్థులు పర్యావరణ పరిరక్షణతో పాటు శరీరక వ్యాయామంపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఎంపీ పాఠశాల చైర్మన్ పట్లోళ్ల ప్రభాకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు జేసుదాస్ అన్నారు. టీఎస్‌పీఏ నుంచి నార్సింగి వరకు నూతనంగా నిర్మించిన సైక్లింగ్ ట్రాక్‌పైన ఎస్ఎంపీ పాఠశాల విద్యార్థులకు సైకిల్ రైడ్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాఠశాల చైర్మన్, ప్రధానోపాధ్యాయులు హాజరై ఈ సైకిల్ రైడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం సైక్లింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసిందన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతిరోజూ సైకిల్ రైడ్ చేయడం ద్వారా శారీరం దృఢంగా మారుతుందన్నారు. కాలుష్యం బారి నుంచి సమాజాన్ని కాపాడడంలో మిగతా వాహనాలతో పోలిస్తే సైకిల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సైక్లింగ్ రైడ్ విజయవంతం అవ్వాలని, ప్రతిఒక్కరూ ఈ సైక్లింగ్ ట్రాక్‌ను వినియోగించుకోవాలని, పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రకాశ్‌గౌడ్‌కు స్వాగత హారతులు



రాజేంద్రనగర్ సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ గురువారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్, గణేష్ నగర్‌లో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మహిళలు ఆయనకు మంగళ హారతులు పట్టి స్వాగతం పలికారు. – మణికొండ

ఇస్త్రీ నేను చేస్తా.. ఓటు వేయాలన్నా..



రాజేంద్రనగర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర గౌడ సంఘం ఉపాధ్యక్షురాలు బత్తిని లతాగౌడ్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్ తరపున ప్రచారం చేస్తూ అపార్ట్‌మెంట్‌లలో ఇస్త్రీ చేసి ఓటు అడిగారు. – మణికొండ